క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: మండలంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ మండల ఏఈ కె.కోటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం అలాగే 33 కేవీ సబ్ స్టేషన్‌లో బ్రేక్ పనులు చేసేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరగనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం 11 గంటలకు ప్రారంభం కానుందని కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని తెలియజేశారు.

రేపు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

దాచేపల్లి : నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31వ తేదీన జరుగుతుందని కమిషనర్ డీవీఎస్ నారాయణరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

కెనాల్స్ కాలనీలో దొంగతనాలు

మాచర్ల: పట్టణంలోని సుద్దగుంతల, కెనాల్స్ కాలనీలో రాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్న ఘటనలు ఆ ప్రాంత వాసులకు ఆందోళన కలిగిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం నూతనంగా ఇంటిని నిర్మించుకున్న కాలనీ వాసి నరసింహారావు ఇంట్లో దొంగతనానికి దుండగులు యత్నించారు. అదే విధంగా ఆదివారం రాత్రి ఆ ప్రాంతంలో నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్న పోలేపల్లి ఆనంద్ ఇంటి శ్లాబు కోసం సిద్ధంగా ఉంచిన ఇనుపరాడ్లను దొంగతనం చేశారు. వరుసగా ఆ ప్రాంతంలో దొంగతనాలు చేస్తూ హల్‌చల్ చేస్తున్న విషయాన్ని పోలీసులకు తెలపగా వారు విచారణ కొనసాగిస్తున్నారు.

మాచర్ల, గురజాల డివిజన్‌లలో 44.4 మి.మీల వర్షపాతం

మాచర్ల: మాచర్ల, గురజాల నియోజకవర్గాలలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 44.4 మి.మీల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో శ్యాం తెలిపారు. 29వ తేదీ రెయిన్‌ఫాల్ మాచర్ల, గురజాల డివిజన్‌లో సుమారుగా 4.93 మి.మీ కురవాల్సి ఉండగా అత్యధికంగా 44.4 మి.మీ నమోదైనట్లు తెలిపారు. మాచర్ల మండలంలో 19 మి.మీ, వెల్దుర్తి 7.2, దుర్గిలో 12.8, దాచేపల్లిలో 5.4 మి.మీ, కారెంపూడి, మాచవరం, గురజాల, పిడుగురాళ్లలో పూర్తిగా వర్షపాతం నమోదు కాలేదన్నారు.

ఆదర్శానికి మారు పేరు డొక్కా సీతమ్మ

కారెంపూడి: ఆకలి తీర్చడం కోసం యావదాస్తిని, తన కష్టాన్ని త్యాగం చేసిన ఆదర్శమూర్తి డొక్కా సీతమ్మ అని, అలాంటి త్యాగమూర్తి పేరు విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం పెట్టడం ఆదర్శవంతమైన నిర్ణయమని జన సేన పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బూసా రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజనం కార్యక్రమంలో జన సేన కేడర్ పాల్గొని, విద్యార్థులకు స్ఫూర్తివంతమైన డొక్కా సీతమ్మ జీవిత చరిత్రను ఉపాధ్యాయులు వివరించాలని పేర్కొన్నారు. కారెంపూడి జెడ్పీ హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు, పార్టీ నాయకులు ఎస్ఎంకే నాయుడు, పాలెపోగు బాబు, మిరియాల అశోక్, కొండా పవన్, పలిశెట్టి వినయ్ పాల్గొని విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డించారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

రెంటచింతల: రెంటచింతలలో ఆదివారం రాత్రి ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు ఎస్సై ఎం.ఆంజనేయులు సోమవారం తెలిపారు. గ్రామంలోని ఎర్రబాలెం కాలనీలో టీడీపీ - వైఎస్సార్‌సీపీ వర్గాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం వలన బోయిన చౌడయ్య, పేర్ల శ్రీనివాసులకు గాయాలైనట్లు వెల్లడించారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాలలో ఎవరైనా ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా మాట్లాడినా.. వ్యక్తిగత కారణాలతో ఘర్షణ పడి పార్టీల రంగు పులిమిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బెల్లంకొండ: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన బెల్లంకొండలో సోమవారం చోటుచేసుకుంది. గేదె యజమాని పాకాలపాటి షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రోజు మాదిరిగా మేతకు గేదెను తీసుకెళ్లగా.. మధ్యాహ్న సమయంలో కొత్తపాలెం రోడ్డులో ఉన్న కాలువ సమీపంలో విద్యుత్ ఎర్త్ వైరు తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఎర్త్ వైర్ చుట్టూ ఫెన్సింగ్ వేయమని విద్యుత్ సిబ్బందికి ఎన్నోమార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. వారి నిర్లక్ష్యం వల్లే తన గేదె చనిపోయినట్లు యజమాని వాపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

శుభ తిథి భోజనం.. ప్రజల భాగస్వామ్యం



పశర్లపాడులోని శుభ తిథి భోజన కార్యక్రమంలో ఎంఈవో-2 శివనాగేశ్వరరావు, టీచర్లు



మంచికల్లులోని శుభ తిథి భోజన కార్యక్రమంలో హెచ్‌ఎం వసంతకుమారి, గ్రామ పెద్దలు

- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎంఈవో
- గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలోని పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం కార్యక్రమంలో ఆయా గ్రామ ప్రజలను భాగస్వాములను చేయడానికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన శుభ తిథి భోజనంలో... గ్రామ ప్రజల భాగస్వామ్యానికి మంచి స్పందన వచ్చినట్లు ఎంఈవో-2 వై.శివనాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పశర్లపాడు గ్రామం పాఠశాలలో ప్రారంభించిన శుభ తిథి భోజనంలో పాల్గొని అమలు తీరును పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న 36 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఆయా గ్రామస్తులను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మౌలిక వసతులను అవగాహన కలిగి అక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందచేయడానికి గ్రామ ప్రజలకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

మెయిన్ స్కూల్లో శుభదిన్ భోజన్

కారెంపూడి: స్థానిక ఎంపీపీ మెయిన్ స్కూల్లో శుభ దిన్ భోజన్ కార్యక్రమం సోమవారం జరిగింది. కారెంపూడి టీడీపీ నాయకుడు బాణావతు బాలు నాయక్ పాఠశాలలో ఉన్న 230 మంది విద్యార్థులకు స్వీట్స్‌తో కూడిన విందు భోజనం తయారు చేయించి పెట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పుల్లమ్మ, టీడీపీ నాయకులు షేక్ మస్తాన్ జానీ, బర్మా నాయక్, ఎస్‌పీఆర్ కృష్ణ, కటికల బాలకృష్ణ, కాసుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికే పల్లె నిద్ర

పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు



మాట్లాడుతున్న పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు

పిడుగురాళ్ల: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకే పల్లె నిద్ర నిర్వహిస్తున్నామని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. మండలంలోని గుత్తికొండ గ్రామంలో ఆదివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు అయిపోయాయని ఎవరూ రాజకీయంగా గొడవలకు దిగవద్దని, అందరు సోదర భావంతో మెలగాలని సూచించారు. అదేవిధంగా ఎవరైనా గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచటం జరుగుతుందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను అమ్మితే సహించేది లేదన్నారు. అటువంటి వారి వివరాలు తమకు తెలియజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై పఠాన్ రబ్బానీ ఖాన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు



మాచర్ల: రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు పల్నాడు జిల్లా మాచర్ల నుంచి సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తుమ్మా సుజాత, పీఈటీ ఎం.కుమార్‌లు సోమవారం తెలిపారు. సాగర్ రోడ్డులోని సెయింట్ ఆన్స్ విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల జిల్లా తరపున పోటీ పడి ఉత్తమ ఫలితాలు సాధించి ఆగస్టు 17, 18, 19 తేదీలలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే పోటీలకు తమ విద్యార్థులు ఎంపిక కావటం అభినందనీయమన్నారు. కార్తీక్, బాలాజి, పార్థసారధి, విజయపవన్‌నాయక్, గణేష్‌లు ఎంపికై నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికై స్కూల్‌కు, రాష్ట్రానికి మంచి పేరు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీస్తును పరిశుద్ధంగా ఆరాధించాలి



మాట్లాడుతున్న పాస్టర్ పప్పుల జయపాల్

దాచేపల్లి : ఏసుక్రీస్తుని రక్షకుడిగా అంగీకరించి భూలోకంలో పవిత్రంగా జీవించాలని పాస్టర్ పప్పుల జయపాల్ అన్నారు. నగర పంచాయతీలోని దక్షిణగడ్డ లూథరన్ చర్చి 28వ వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థన కూడికను ఏర్పాటు చేశారు. పాస్టర్ జయపాల్ మాట్లాడుతూ.. ప్రభువైన ఏసుక్రీస్తు సర్వ మానవళి కోసం ఈ లోకానికి వచ్చాడని, క్రీస్తు ఆరాధకులు పవిత్రంగా, పరిశుద్ధంగా ఆరాధించాలన్నారు. క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు పాపాలను అంగీకరించి నూతనమైన జీవితం జీవించాలని, క్రీస్తు రాకడ కోసం కనిపెట్టుకుని జీవించాలని ఆయన తెలిపారు. ఏలూరుకు చెందిన పాస్టర్ ఉదయ్‌భాస్కర్ ప్రత్యేక వర్తమానం అందించారు. సంఘ విశ్వాసులు ప్రత్యేకంగా గీతాలను ఆలపించారు. పగిడిపల్లి రాజేష్ బృందం సంగీతం అందించారు. అనంతరం భోజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పాన్నూరి రాజారావు, చర్చి డేలిగేట్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు మొక్కలు అందజేత



కారెంపూడి: స్థానిక ఆదర్శ పాఠశాలకు టీడీపీ నాయకులు సోమవారం మొక్కలను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ నయోమికి పార్టీ జిల్లా నాయకుడు పంగులూరి అంజయ్య తదితరులు మొక్కలను అందించారు. తర్వాత పాఠశాల ఆవరణలో అంజయ్య, గాడిపర్తి పూర్ణయ్య, గోరంట్ల నాగేశ్వరరావు, నర్సింగ నాగేశ్వరరావు, వసంత రామారావు, తుపాకుల రత్తయ్య, వల్లెపు కొండలు, మహంకాళి శ్రీను తదితరులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమంలో పార్టీ కేడర్ పాల్గొనాలని ఇచ్చిన పిలుపు మేరకు ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటడం జరిగిందని టీడీపీ నాయకుడు అంజయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆగస్టు 3 నుంచి ఉపవాస ప్రార్థనలు



మాచర్ల: పట్టణంలోని పాత మాచర్ల, 25వ వార్డులోని మరనాత విశ్వాస సమాజం వారు నిర్వహించే ఉపవాస ప్రార్థనలు 40 రోజులు కొనసాగించటానికి క్రైస్తవ సభ్యులంతా సన్నద్ధం కావాలని మరనాత విశ్వాస సమాజం చర్చి పాస్టర్ వై వెంకటేశ్వరరావు సోమవారం కోరారు. ఆయన పట్టణంలోని నర్సింహమూర్తి, పద్మావతి నర్సింగ్ హోమ్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 3 నుంచి సెప్టెంబర్ 11 వరకు ఉపవాస ప్రత్యేక ప్రార్థనలు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు, రాత్రి 7 గంటల నుంచి 9 వరకు నిర్వహించటం జరుగుతుందన్నారు. చర్చి వ్యవస్థాపకులు ముఖ్య అతిథులుగా గుండ్లపల్లి మోజెస్ చౌదరితో పాటు పలువురు ఆత్మీయ దైవజనులు ప్రసంగించటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని క్రైస్తవ భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శక్తివంతమైన దైవ సందేశం, కుటుంబ పరంగా అభిషేకం, దైవారాధన కార్యక్రమాలు జరుగుతాయని వెంకటేశ్వరరావు (ఎలీషా) తెలిపారు. వివరాలకు 9989614917 నంబరులో సంప్రదించాలన్నారు.

కలుపు నివారణతో.. అధిక దిగుబడి



అహ్మద్, ఏఓ



దిడుగు గ్రామ సమీపంలో పత్తి పైరులో అంతర కృషి

అమరావతి: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో అన్ని గ్రామాలలో పత్తి పంటలో ఇప్పటికే రైతులు కలుపు సమస్యను ఎదుర్కొంటున్నారు. గత పదిహేను రోజులుగా వర్షాల కారణంగా రైతులు పొలాన్ని సరిగా దున్నక పోవడం, సిఫార్సు చేసిన దాని కంటే ఎక్కువ మోతాదులో ఎరువులు వేయడం, సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్ల పంట పోలాల్లో కలుపు విపరీతంగా పెరిగిపోయింది. ఈ కలుపు వల్ల పంట దిగుబడి 12 నుంచి 51 శాతం వరకు తగ్గడంతో పాటు నాణ్యత తగ్గే ప్రమాదముంది. అనేక రకాల కలుపు మొక్కల వల్ల వివిధ రకాల తెగుళ్లు, పురుగులు ఆశ్రయించడంతో సాగులో ఖర్చు పెరిగి పోతుంది. రైతులు సకాలంలో కలుపును నిర్మూలిస్తే దిగుబడులు పెరిగి, ఖర్చు కూడా తగ్గే అవకాశముంది. మొక్కలు నాటిన తర్వాత తొలి ఆరు వారాలు కలుపు నివారణకు ఎంతో కీలకమైనది. ఏ రకం కలుపు మొక్కలను ఏ రకం మందులతో నిర్మూలించాలో రైతులు ముందుగా అవగాహన చేసుకోవాలి. పైరులో కలుపును నివారణకు సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వేసుకోవాలి. పత్తి విత్తిన తర్వాత ప్రతి పది రోజులకు ఒకసారి కలుపు తీయించాలి. గ్రామీణ ప్రాంతాల పొలాల విస్తీర్ణానికి తగ్గట్టుగా కూలీల లభ్యత లేకపోవడంతో, ప్రస్తుతం కూలీ రేట్లు కూడా పెరగటంతో కలుపుల నివారణకు రైతులు రసాయనిక మందుల పైనే ఆధార పడుతున్నారు.

కలుపు నివారణకు సూచనలు

కలుపు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ రైతులకు వివరిస్తూ కలుపు మందులు వేసినప్పటికి ప్రత్తి పైరులో 25 నుంచి 30రోజుల వరకు పనిముట్లతో అంతర కృషి చేయాలన్నారు. పంటకు సరిపోయే కలుపు మందులు సరైన మోతాదులో సరైన సమయంలో వాడాలని సూచించారు. విత్తనం వేయగానే 24 నుండి 48 గంటల లోపు కలుపు మందులు పిచికారి చేయాలని, కలుపు మందును పవర్ స్ప్రేయర్‌తో కాకుండా హ్యాండ్ స్ప్రేయర్‌తోనే స్ప్రే చేయాలని సూచించారు. భూమిలో బాగా పదును ఉన్నప్పుడు మాత్రమే కలుపు మందులు చల్లడం లాభదాయకమని, కలుపు మందులు వేసిన తర్వాత కనీసం 6గంటల వరకు వర్షం పడకుండా ఉండాలని, కలుపు మందులను ఉదయం లేదా సాయం కాలం మాత్రమే పిచికారి చేయాలన్నారు. అలాగే వ్యవసాయాధికారుల సలహా మేరకు ఎకరాకు రెండు లీటర్ల పెండిమిథాలిన్, ఒక లీటరు గ్రామోక్సిన్‌ను 200 లీటర్లలో కలిపి మొక్కలపై పడకుండా పిచికారి చేయాలని వివరించారు.

నారు పెంపకంపై అవగాహన ఉండాలి

రాజుపాలెం: నర్సరీలలో నాణ్యమైన నారునే పెంచాలని ఉద్యాన శాఖాధికారి డి.నవీన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయిలోని నర్సరీ యజమానులకు నారు పెంపకాలపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ రైతులు విత్తనాలు నాటే సమయంలో తప్పనిసరిగా వారి నుంచి బిల్లు తీసుకోవాలని తెలిపారు. ప్రతీ నర్సరీ యజమాని రిజిస్టర్లను నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. లైసెన్సులను రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. అనంతరం కొండమోడు, రెడ్డిగూడెం, రాజుపాలెం గ్రామాలలో గల నర్సరీలను పరిశీలించారు.

ఉత్తమ వైద్య సేవలకు కేరాఫ్ ప్రభుత్వాసుపత్రి

- వైద్య సేవలు పొందుతున్న పేదలు
- ఉత్తమ అవార్డులు పొందుతున్న మాచర్ల ప్రభుత్వాసుపత్రి
- 12 విభాగాల్లో సేవలు



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



అత్యవసర విభాగము

మాచర్ల: వెనుకబడిన పల్నాడులో అనేక సంవత్సరాలుగా పేదలు ఉత్తమ వైద్యానికి గుంటూరు, నరసరావుపేట వెళ్లాల్సిందే. వేల రూపాయలు ఖర్చు చేసి అవస్థలు పడేవారు. ఆ పరిస్థితిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పూర్తిగా మార్చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేశారు. 2004లో అధికారంలోకి రాగానే కంభంపాడు, విజయపురిసౌత్, ఏడో మైలు, రెంటచింతల, కారంపూడి, వెల్దుర్తి, దుర్గి మండలాల్లో సుమారు 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్యులను అందుబాటులో ఉంచారు. అప్పటి నుంచి ప్రభుత్వాసుపత్రిలో పనితీరు మారింది. ఆ తరువాత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. మాచర్ల పట్టణంలో ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి దాదాపు 35 కి.మీల దూరంలోని వారూ వచ్చేవారు. ఈ స్థితిని గమనించిన జగన్ 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా చేసేందుకు రూ.3 కోట్లు కేటాయించి ఆధునీకరణ పనులు చేపట్టారు. వివిధ విభాగాలకు చెందిన 12 మందిని నియమించి 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. 104, 108, తల్లీ బిడ్డ అంబులెన్స్, ఆపరేషన్ థియేటర్.. అన్నీ అందుబాటులో ఉంచారు. గతంలో 2014 –19 వరకు కేవలం నలుగురు వైద్యులతో 150 ఓపీ చూసేవారు. 2019 తరువాత 400 మంది రోగులు వైద్యం పొందుతున్నారు. ఇన్‌పేషెంట్, ఆపరేషన్లు, కాన్పులు, పిల్లల వార్డు ఎప్పుడూ బిజీగా ఉండే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాసుపత్రి అభివృద్ధితో గుంటూరు, నరసరావుపేట రిఫర్స్ తగ్గాయి. ఉత్తమ వైద్యాన్ని సూపరింటెండెంట్ ఉదయభాను, ప్రముఖ వైద్యులు కేపీ చారి, దినేష్, పలువురు మహిళా వైద్యులు నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలందిస్తున్నారు. గతంలో సౌకర్యాలు లేని ఆసుపత్రిలో ప్రసూతి విభాగం, 12 విభాగాల్లో ఓపీ నిర్వహిస్తూ, ఈసీజీ, ఎక్సరే, అత్యవసర విభాగం, డయాలసిస్ సెంటర్, ఎప్పుడూ రోగులతో కిటకిటలాడుతున్నాయి. రక్త నమూనా పరీక్షలతో పాటు 24 గంటలు వైద్యులు ఎమర్జెన్సీలో సేవలందిస్తున్నారు. ఉత్తమంగా వైద్యాన్ని అందిస్తూ ప్రభుత్వాసుపత్రి అన్ని విభాగాల్లో ముందుకెళ్తూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందింది.

ఉత్తమ సేవలందించటమే మా లక్ష్యం



ప్రభుత్వాసుపత్రిలో నిత్యం రోగులకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నాం. ఎక్కడా రాజీపడకుండా మందులు, వైద్య సేవలు అందించటంలో ముందుంటున్నాం. ప్రతి రోగికి ఉత్తమ సేవలందించేందుకు కృషి చేస్తున్నాం. కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు ఉత్తమ సేవలందించటం ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమంగా పేరు పొందాం. ప్రతి పేదవాడు వైద్యం పొంది ఆరోగ్యంగా ఉండాలన్నదే మా లక్ష్యం.

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఉదయభాను

ఉత్తమ సేవలందిస్తున్న ప్రభుత్వ వైద్యశాల



మాచర్ల ప్రభుత్వాసుపత్రి ఎన్నో సౌకర్యాలతో పేద రోగులకు అందుబాటులో ఉంది. ఇప్పుడు అన్ని రకాల రోగులకు వైద్యులు మెరుగైన సేవలందించేలా జిల్లా వైద్య శాఖాధికారులు తీర్చిదిద్దారు. రాబోయే రోజుల్లోనూ ఇదే విధంగా వైద్య సేవలందించి ముందుకు సాగాలని కోరుతున్నాను. ఇతర ప్రాంతాలకు పంపకుండా పేదలకు ఇక్కడే వైద్య సేవలందిస్తే మా సంఘం ప్రత్యేక అభినందనలు తెలుపుతుంది.

జెట్టిపాలెం వెంకటేష్, ప్రజా సంఘ నాయకుడు

ఇసుక రీచ్‌లో దళారుల దందాపై చర్యలు

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుక రీచ్‌లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన ఉచిత ఇసుక పథకంలో దళారుల వసూళ్లపై ఇసుక తోడేస్తున్నారు కథనానికి స్పందన ఇసుక రీచ్‌లలో అధికారులు చర్యలు చేపట్టారు. వైకుంఠపురం ఇసుక రీచ్‌లోకి వాహనం రాగానే టోకెన్ ఇవ్వడం, టోకెన్ నంబరు ప్రకారం బిల్లు రాయడం పద్ధతిని అనుసరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను సోమవారం నుంచి అమలు చేస్తున్నారు. అలాగే మునగోడు, మల్లాది గ్రామాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు జరక్కుండా రెండు గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ బ్రహ్మం తెలిపారు. ఇసుక రీచ్‌లలో సమస్యలు లేకుండా రవాణా సక్రమంగా సాగటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

అమరావతి: మండల పరిధిలోని మునగోడు బస్టాండు వెనుక ఉన్న డంపింగ్ యార్డు సమీపంలో సోమవారం జూదమాడుతున్న ఆరుగురుని అమరావతి పోలీసులు అరెస్టు చేశారు. సమాచారం మేరకు దాడి చేయగా.. పేకాట ఆడుతున్న అరుగు రుని అదుపులోకి తీసుకుని, వారినుంచి రూ. 7,420లు నగదును స్వాధీనంచేసుకున్నట్లు తెలి పారు. వీరిపై కేసునమోదుచేసి, సత్తెనపల్లికోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ బ్రహ్మం తెలిపారు.

తప్పిపోయిన పాపను వెతికి పట్టుకున్న పోలీసులు



కారెంపూడి: తప్పిపోయిన పాపను పోలీసులు వెతికి తల్లి దండ్రులకు అప్పగించిన ఘటన కారెంపూడిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక క్వారీ గుంతల్లో నివాసం ఉంటున్న అరుబ్రోలు ప్రసాద్ ఐదేళ్ల కుమార్తె కోమలి సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు ఎస్సై కె.అమీర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన వెంటనే ఎస్సై అమీర్ సిబ్బందితో కలిసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో పాటు సోషల్ మీడియా వేదికగా పాప ఆచూకీ తెలిస్తే పోలీసులకు తెలపాలని ఎస్సై కోరడం జరిగింది. సోమవారం సాయంత్రం పాప ఆచూకీ దొరకడంతో పాపను ఎస్సై అమీర్ తల్లిదండ్రులకు అప్పగించారు. పాప తల్లిదండ్రులు, బంధువులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నాగవరంలో ఎస్ఐ షఫీ పల్లెనిద్ర



నాగవరం పల్లెనిద్రలో ఎస్ఐ షఫీ

నాగవరం(క్రోసూరు): జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని నాగవరం గ్రామంలోఎస్ఐ ఎం.షఫీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పల్లెనిద్ర కార్యక్రమం ఆదివారం రాత్రి చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామ పరిస్థితులు నిత్యం తెలుసుకుంటున్నామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఎవరూ ఎటువంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడవద్దని హితవు పలికారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజం గా ఉంటాయన్నారు. గెలిచిన వారు హుందాగ ఉండాలని, ఓడిన వారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడకుండా అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని కోరారు. ముందుగా గ్రామంలోని అన్ని వీధుల్లో ఎస్ఐ, సిబ్బంది తిరిగారు. గ్రామ పెద్దలు కూడా పోలీసులకు సహకరిస్తామని మాట ఇవ్వడం జరిగిందన్నారు.

విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలి

రాజుపాలెం: విత్తనాలను ఎమ్మార్పీకే కంటే అధికంగా విక్రయిస్తే.. విత్తన దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి వెంకట నర్సయ్య హెచ్చరించారు. మండలంలోని గణపవరంలో ఉన్న కీర్తి సీడ్స్, సాంబశివ ఏజెన్సీ, శ్రీవెంకటేశ్వర సీడ్స్ దుకాణాల్లో ఏవో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా స్టాకు రిజిస్టర్లను, బోర్డులను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులను విచారించగా విత్తనాలను ఎమ్మార్పీ కే ఇస్తున్నారని వారు తెలిపారు. బిల్లులో వేసిన రేటు ప్రకారం రైతులు చెల్లించాలని, ఎక్కువ చెల్లించరాదని తెలిపారు. కృత్రిమంగా విత్తనాలు కొరత ఏర్పడిందని సృష్టించి ఎక్కువ ధరలకు విక్రయించినట్లయితే.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు తదితరులు ఉన్నారు.

